Title Code: TELTEL 02105

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను
తెలంగాణ షాన్
తెలుగు దినపత్రిక
నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను
ఆసక్తి గల యువతీ యువకులు
సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 1 Issue: 221 | Saturday, October 14, 2023 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 221 | శనివారం, అక్టోబర్ 14, 2023 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

### 40 చోట్ల అభ్యర్థులే లేని కాంగ్రెస్..

## 70 చోట్ల ఎలా గెలుస్తుంది..?



హైదరాబాద్ : తెలంగాణలో 40 చోట్ల అభ్యర్థులే లేని కాంగ్రెస్.. 70 చోట్ల గెలుస్తామని ఆ పార్టీ నాయకులు ఎలా చెబుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. డబ్బులు ఇచ్చిన వారికే కాంగ్రెస్ టికెట్లు దక్కుతున్నాయి. కూకట్‌పల్లి సీటు కోసం రూ. 15 కోట్లు అడిగారని ఓ కాంగ్రెస్ నేత చెప్పారు. నేను చెప్పినట్టే కర్ణాటకలో అక్రమ డబ్బు జమ అవుతోంది. ఇప్పటికే రూ. 8 కోట్లు కొడంగల్ చేరినట్టు సమాచారం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్ వంద నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తారని కేటీఆర్ తెలిపారు. జీహెచ్ఎంసీ, సిరిసిల్ల, కామారెడ్డిలో నేను ప్రచారం చేస్తాను. ఎన్నికల నిర్వహణలో ఈసీ స్వతంత్రంగా పని చేస్తుందని భావిస్తున్నా. అధికారుల బదిలీలను సాధారణ బదిలీలుగానే చూస్తాం. హుజురాబాద్‌లో కూడా మేమే గెలుస్తాం. ఈటల రాజేందర్ 50 చోట్ల పోటీ చేసినా, షర్మిల 119 సీట్లలో పోటీ చేసినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ లీడర్ కాదు.. రీడర్ అని కేటీఆర్ విమర్శించారు. పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరుతానంటే రేపే వెళ్లి ఆహ్వానిస్తాను. త్వరలో చాలా మంది ప్రముఖులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత గాంధీ భవన్‌లో తన్నుకుంటారు. కాంగ్రెస్‌లో సీఎం పదవికి ఇద్దరి మధ్య అంగీకారం కుదిరినట్టు సమాచారం ఉందన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు పంచినా...

## గెలిచేది మాత్రం బీఆర్ఎస్ పార్టీనే

: మంత్రి హరీశ్‌రావు



మెదక్ : తెలంగాణ ఎన్నికల్లో డబ్బు పంచి గెలించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమంగా సంపాదించిన డబ్బును తెలంగాణకు చేరవేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో జరిగిన ఐటీ దాడుల్లో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన అంబికా పతి, ఆయన భార్య అశ్వత్త ఇంట్లో రూ. 52 కోట్లు పట్టుబడ్డాయని మంత్రి తెలిపారు. కర్ణాటకలో గతంలో అధికారంలో ఉన్న బీజేపీ కాంట్రాక్టర్ల వద్ద 40 శాతం కమీషన్ వసూలు చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ 50 శాతం వసూలు చేస్తుందని మంత్రి ఆరోపించారు. ఇలా కాంగ్రెస్ పార్టీ స్కాంగ్రెస్‌గా మారిందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టికెట్‌లు అమ్ముకొంటున్నట్టు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

### నేను కేసీఆర్ కుమార్తెగా గర్వపడుతున్నాను..

## రాజకీయ వారసత్వాలను గౌరవిస్తాం

: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : తాను సీఎం కేసీఆర్ కుమార్తెగా గర్వపడుతున్నానని, తాము రాజకీయ వారసత్వాలను గౌరవిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. ఒక టీవీ ఛానల్ నిర్వహించిన సమ్మిట్‌లో ఆమె చేసిన ప్రసంగపు వీడియోను జతచేస్తూ ఈ మేరకు శుక్రవారం కల్వకుంట్ల కవిత ట్వీట్ చేశారు.

బీజేపీతో అంటకాగినప్పుడు పలు పార్టీల్లో వారసత్వ రాజకీయాలు బీజేపీకి కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. బీజేపీకి లొంగితేనే కుటుంబ పార్టీలు ఆ పార్టీకి ఆమోదయోగ్యమా ? అని కవిత ప్రశ్నించారు. అయితే, ఒక టీవీ సంస్థ నిర్వహించిన సదస్సులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఎండగడుతూ కవిత చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడులో కూడా వైరల్ అవుతున్నాయి. ఎమ్మెల్సీ కవితకు తమిళనాడు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కవిత చేసిన ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు.

**కవిత వ్యాఖ్యలను సమర్థిస్తూ తమిళులు పెద్ద ఎత్తున ట్వీట్లు**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దృష్టి మళ్లింపు రాజకీయాలు చేస్తుండటమే కాకుండా ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వదని, గత పది సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం రూ. 100 లక్షల కోట్ల అప్పు తెచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చెయ్యకపోవడమే కాకుండా దక్షిణాది రాష్ట్రాలకు ప్రత్యేకంగా ఎటువంటి ప్రాజెక్టులు మంజూరు చేయడం లేదని సదస్సులో కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు.

### ఈటల రాజేందర్‌కు దమ్ముంటే...

## గజ్వేల్‌లో మాత్రమే పోటీ చేయాలి

: మంత్రి గంగుల



కరీంనగర్ : బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే ఒకేచోట పోటీ చేయాలని, ఓటమి భయంతోనే రెండు చోట్ల పోటీ చేస్తానని చెబుతున్నాడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. దమ్ముంటే గజ్వేల్‌లో ఒకే చోట పోటీ చేయాలని రెండు చోట్ల చేయాల్సిన అవసరం ఎందుకని ప్రశ్నించారు. శుక్రవారం కొత్తపల్లి మండలం చింతకుంటలో జరిగిన బీఆర్ఎస్ యువత ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి గంగుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తానన్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఈటలకు దమ్ముంటే గజ్వేల్‌లో మాత్రమే కేసీఆర్ పై పోటీ చేయాలని, హుజురాబాద్‌లో కూడా బరిలో నిలుస్తానని చెప్తున్నాడంటే ఓటమి భయంతోనే అలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ బీఫారాలు ఢిల్లీలో ఒకే చోట సిద్ధమవుతాయని, ఈ రెండు పార్టీలు కలిసే ఉంటాయని మంత్రి గంగుల ఆరోపించారు. బీజేపీకి తెలంగాణలో గుండు సున్నా వస్తుందని, ఆ భయంతోనే ఈటల రాజేందర్ రెండు చోట్ల పోటీ చేస్తానని చెబుతున్నాడు. మతతత్వ పార్టీలకు, భూకబ్జాలకు పాల్పడే పార్టీలకు అధికారం ఇవ్వొద్దని కోరారు. ఆంధ్రానేతలపై మరో సారి మంత్రి గంగుల కమలాకర్ విరుచుకపడ్డారు. వైఎస్ షర్మిల, కేఏ పాల్, కేవీపీ రామచందర్ రావు, కిరణ్ కుమార్ రెడ్డిలకు తెలంగాణాలో ఏం పని అంటూ ప్రశ్నించారు.

## బీఆర్ఎస్‌లోకి హస్తం నేతలు..ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు



పెద్దఅంబర్‌పేట: రాష్ట్రంలో కనీవినీ ఎరుగనిరీతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అందరూ బీఆర్ఎస్‌లో చేరేందుకు ఇష్టపడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 15వ వార్డు పరిధి మర్రిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి గ్రామానికి రూ.కోట్లలో నిధులు కేటాయించి, మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో కాంగ్రెస్ నాయకులు నక్క బుచ్చయ్యగౌడ్, సీక కృష్ణాగౌడ్, నక్క మహేందర్‌గౌడ్, గౌడ సంఘం డైరెక్టర్ నక్క అమరేందర్‌గౌడ్, నక్క పాండుగౌడ్, నక్క హనుమంతుగౌడ్, నక్క వేణుగౌడ్, సీక శంకరయ్యగౌడ్, సీక స్వామి గౌడ్, సీక దాసుగౌడ్, నక్క రాజుగౌడ్, నక్క హరిబాబు గౌడ్ తదితరులు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాశం దామోదర్, అనంతుల వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు కప్ప సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు నక్క శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేస్తుందని, బజారులో గొడ్డును అమ్ముకున్నట్టు టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతానికి భిన్నంగా వ్యక్తి స్వామ్యం నడుస్తుందని, ఉదయ్ పూర్ డిక్లరేషన్ అమలు చేసే పరిస్థితి లేదని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి భూమి పుత్రులుగా ఉన్న వాళ్లక అవమానాలు, కొత్తగా వచ్చిన వాళ్లకు పెద్దపీట వేస్తూ పాత వాళ్లు ఉనికి కోల్పోయేలా చేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం పార్టీ అంశాలు కూడా చర్చించేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ టికెట్ విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న పొన్నాల రాజీనామా అనంతరం ఎవరికి అందుబాటులో లేకుండా పోయారు.

### తెలంగాణ ఎన్నికలపై కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్...

## 18న కొండగట్టుకు రాహుల్‌గాంధీ, ప్రియాంక రాక

న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించడంతో ఎన్నికల ప్రచారం జోరందుకుంటోంది. అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్న సీఎం కేసీఆర్..

అక్టోబర్ 15 నుంచి తెలంగాణ రాష్ట్రంలో విస్తృత పర్యటనలు చేవట్టేందుకు రెడీ అయిపోయారు. అటు బీజేపీ, కాంగ్రెస్ కూడా ప్రచార పర్వంపై ఫుల్ ఫోకస్ పెట్టాయి. తెలంగాణలో పార్టీ విజయమే లక్ష్యంగా.. ఆ పార్టీల జాతీయ నేతలు నేరుగా రంగంలోకి దిగుతున్నారు. తెలంగాణ ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వచ్చే వారం తెలంగాణ పర్యటనకు రానున్నారు. ఈ నెల 18న వారిద్దరూ జగిత్యాలలో పర్యటించనున్నారు. ముందుగా కొండగట్టు అంజన్నను దర్శించుకుని తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా వారి వెంట కొండగట్టు ఆలయాన్ని దర్శించుకుని, ప్రత్యేక





పూజలు నిర్వహిస్తున్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న తర్వాత ఆ రోజు సాయంత్రం జగిత్యాలలో బహిరంగ సభలో పాల్గొంటారు. రాహుల్ గాంధీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, జగిత్యాల జిల్లా పార్టీ నేతలు తలమునకలయ్యారు. జగిత్యాలలోని కొత్త బస్టాండ్ వద్ద ఆ రోజు సాయంత్రం రాహుల్ గాంధీ రోడ్ షో నిర్వహించనున్నారు.

కొండగట్టు ఆలయాన్ని 18 తేదీన మధ్యాహ్నం రాహుల్ గాంధీ దర్శించుకుంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అక్కడ పూజల అనంతరం ప్రచార రథాల(బస్‌లు) ను రాహుల్ గాంధీ ప్రారంభిస్తారని తెలిపారు. కొండగట్టు నుంచి ప్రచారరథంలో రాహుల్ గాంధీ జగిత్యాలకు చేరుకుంటారని వివరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ రాష్ట్ర నేతలు భారీ జనసమీకరణ చేపట్టనున్నారు. అక్టోబర్ 18 నుంచి 20 తేదీ వరకు రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటిస్తారని తెలుస్తోంది.

### గాజాపై కురిసిన 6వేల బాంబులు...

## వైట్ పాస్పరస్‌తోనూ అటాక్!



జెరుసలాం: రాకెట్లతో హమాస్ దాడి చేసిన నేపథ్యంలో.. ఇజ్రాయిల్ కౌంటర్ అటాక్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు చేసింది. అయితే గత శనివారం నుంచి జరుగుతున్న దాడుల్లో సుమారు ఆరు వేల బాంబులను వాడినట్లు తెలుస్తోంది. కేవలం గాజాపైనే ఆరు వేల బాంబులు వేసినట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఆ బాంబులు దాదాపు 4వేల టన్నులు ఉన్నట్లు తెలుస్తోంది. గాజాలో ఉన్న హమాస్ ప్రాంతాలపై బాంబులతో ఇజ్రాయిల్ టార్గెట్ చేసింది. తమ వైమానిక దళం సుమారు 3600 టార్గెట్లను అటాక్ చేసినట్లు ఇజ్రాయిల్ వైమానిక దళం పేర్కొన్నది.

హమాస్ ఆకస్మిక దాడులకు కౌంటర్ అటాక్ ప్రారంభించిన ఇజ్రాయిల్ వైఖరిపై మానవహక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. తమ దాడుల కోసం ఆ దేశం వైట్ పాస్పరస్‌ను వాడినట్లు భావిస్తున్నారు. వివాదాస్పద వైట్ పాస్పరస్ మందును.. గాజా స్ట్రిప్‌తో పాటు లెబనాన్‌లో ఉన్న టార్గెట్లపై వాడినట్లు తెలుస్తోంది. చాలా వేగంగా అంటుకునే గుణం ఉన్న ఆ రసాయనాన్ని.. సాధారణంగా మిలిటరీ వాడుతుంది. వైట్ పాస్పరస్ వల్ల శరీరం కాలిపోయే ప్రమాదం ఉంటుంది. ఆయుధంగా ఆ రసాయనాన్ని వాడితే ప్రమాదాలు తీవ్రంగా ఉంటాయి. జన సాంద్రత ఉన్న ప్రదేశాల్లో ఆ రసాయనాన్ని ఎక్కువగా వాడుతుంటారు. వైట్ పాస్పరస్ వాడడం లేదని ఇజ్రాయిల్ పేర్కొన్నా.. కొన్ని వార్తా సంస్థలు తీసిన ఫోటోల్లో ఆ రసాయనాన్ని వాడినట్లు అర్థమవుతోంది.

గాజా, లెబనాన్‌లో వైట్ పాస్పరస్‌కు చెందిన బాంబులు పేలినట్లు ఉన్న కొన్ని ఫోటోలను మానవ హక్కుల సంస్థ రిలీజ్ చేసింది. ఆకాశంలో ఏర్పడిన తెల్ల మబ్బులకు చెందిన ఫోటోల ఆధారంగా వైట్ పాస్పరస్ రసాయనంతో దాడి జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

తెలంగాణ షాన్

## సంపాదకీయం

# తరాలు మారినా... మారని చట్టాలు

ప్రపంచంలోని పలు ప్రాంతాలు పలు రకాలైన ప్రజాస్వామిక వికాస పంథాలను అనుసరిస్తున్నాయని, ఒకరి నుంచి ఒకరు నేర్చుకోవలసింది చాలా వుందని ఆ విధంగా మన ప్రజాస్వామిక అభ్యాసాలను, విధానాలను మెరుగుప ర్చుకోవ లసిన అవసరం కలదని ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాస్వామ్య శిఖరాగ్ర సదస్సు నుంచి చేసిన పరోక్ష ప్రసంగంలో పేర్కొన్నారు. అదే సమయంలో భారత్ అతి పెద్ద ప్రజాస్వామిక దేశమని, 2500 సంవత్సరాల ప్రజా స్వామిక సత్సంప్రదాయాలకు నిలయమని కూడా అన్నా రు. ప్రజాస్వామ్యంపై ఇంత గొప్ప ప్రసంగాన్నిచ్చిన ప్రధాని మోడీ ప్రభుత్వమే రాజద్రోహ చట్టాన్ని రద్దు చేసుకునే వుద్దేశం లేదని శుక్రవారం నాడే లోక్‌సభలో విస్పష్ట ప్రకటన చేసింది. మాటల్లో గాని, రాతల్లో గాని, సైగల ద్వారా గాని ఏ విధంగానైనా ప్రభుత్వంపై ద్వేషాన్ని, తిరుగుబాటును రెచ్చగొట్టే వారికి గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష విధించడానికి వుద్దేశించిన భారత శిక్షాస్మృతి 124 ఎ సెక్షన్‌ను రద్దు చేసే వుద్దేశం ప్రభుత్వానికి లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు సభలో ప్రకటించారు. రాజద్రోహ నిబంధన బ్రిటిష్ వలస పాలన నుంచి వచ్చిన వారసత్వమని అది దుర్వినియోగమవుతున్న దని పేర్కొం టూ దాని అవసరాన్ని గురించి, చెల్లుబాటును గురించి అభిప్రాయం చెప్పాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందా అని ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు అటువం టిదేమీ లేదని కిరణ్ రిజిజు సమాధానం చెప్పారు.అయితే 1860 నాటి భారత శిక్షాస్మృతిలోని 124 ఎ, 153 ఎ, 505 నిబంధనల పరిధిని అధికారంలో వున్న ప్రభుత్వానికి గాని, పాలకులకు గాని నచ్చని వార్తలను, సమాచారాన్ని ఇవ్వడంలో ముద్రణ, ఎలెక్ట్రానిక్ మీడియాకు గల హక్కుల పరంగా స్పష్టం చేయవలసిన అవసరం వుందని మాత్రం సుప్రీంకోర్టు అభిప్రాయపడినట్టు కిరణ్ రిజిజు సన్నాయి నొక్కులు నొక్కారు. మొత్తానికి ప్రజాస్వామిక సమున్నత విలువ అయిన భావప్రకటన స్వేచ్ఛను కాల రాసే, ప్రజల నోళ్లకు తాళం వేసి పాలకుల నిరంకుశత్వానికి అడ్డు లేకుండా చేసే రాజద్రోహ చట్టాన్ని రద్దు చేయబోమని ఇప్పటికీ నొక్కి చెబుతున్న ప్రభుత్వమున్న భారత దేశంలో ఎటువంటి ప్రజాస్వామ్యం వున్నదో దాని గొప్పతనమేమిటో వివరించవలసిన బాధ్యత ప్రధాని మోడీకున్నది. మాటల్లో మన ప్రజాస్వామ్య ఘనతను ప్రపంచానికి చాటుతూ దేశంలో మాత్రం అసమ్మతిని బొత్తిగా సహించలేక జర్నలిస్టులను, రచయితలను, లాయర్లను, వివిధ ప్రజాసం ఘాలకు చెందిన వారిని రాజద్రోహులుగా ముద్రవేసి జైళ్లలో మగ్గించే పాలన ఎటువంటి ప్రజాస్వామ్య పాలన అవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రజాస్వామిక శిఖరాగ్ర వేదిక నుంచి ప్రధాని మోడీ చేసిన ప్రజాస్వామిక నీతులు ఎంతటి నీటి మూటలో రుజువవుతున్నది.బ్రిటిష్ పాలకులు తమ నియంతృత్వ పాలనపై అసమ్మతిని, నిరసనను, తిరుగుబాటును అణచివే యడానికి రాజద్రోహ నిబంధనను భారత శిక్షాస్మృతిలో చేర్చారు. అంటే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడేవారి నోరు నొక్కడానికి ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అటువంటి శాసనం ఇప్పటికీ కొనసాగుతూ వుండడం, దానిని ఇంకా కొనసాగిస్తామనడం ఘనమైన 2500 ఏళ్ల సత్సంప్రదాయాలతో సంపన్నమైన భారత ప్రజాస్వామ్య లక్షణమా అనే ప్రశ్న తలెత్తుతున్నది. ప్రజలను హింస వైపు రెచ్చగొట్టడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం లేనంత వరకు ప్రభుత్వాలను వాటి చర్యలను విమర్శిస్తూ మాట్లాడడానికి, రాయడానికి, ప్రచురించడా నికి, ప్రసారం చేయడానికి పౌరులకు సంపూర్ణ హక్కు వుందని జర్నలిస్టు, పద్మశ్రీ వినోద్ దువా కేసులో సుప్రీం కోర్టు అభిప్రా యపడింది. 1962 నాటి కేదార్ నాథ్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు కింద ప్రతి జర్నలిస్టుకీ పటిష్ఠమైన రక్షణ ఇవ్వాల్సి వుందని వినోద్ దువా కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లలిత్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ప్రభుత్వాలు, తమ రాజకీయ సిద్ధాంతాలను విమర్శించే ప్రచురణలు, ప్రసారాలకు బాధ్యులైన మీడి యా వ్యక్తులపై కేసులు పెట్టడం ఆనవాయితీ చేసుకున్నా యని ఆయన అన్నారు.ప్రధాని మోడీ ఓట్లను సంపాదిం చడం కోసం చావును, ఉగ్రవాద దాడులను ఉపయో గించుకుంటు న్నారని విమర్శిస్తూ వినోద్ దువా విడుదల చేసిన యూ ట్యూబ్ వ్యాఖ్య పై హిమాచల్ ప్రదేశ్‌లోని శ్యామ్ అనే బిజెపి నాయకుడు దాఖలు చేసిన ఫిర్యాదు సంబంధం గాఆయన మీద రాజద్రోహ నేరారోపణ కేసు దాఖలైంది. ఈ కేసు దర్యాప్తును ఆలస్యం చేసినందుకు హిమాచల్ పోలీసులకు సుప్రీం ధర్మాసనంచీవాట్లు పెట్టిం ది. 84 ఏళ్ల స్టాన్ స్వామి నుంచి 25 ఏళ్ల దిశ రవి వరకు రాజద్రో హం కేసుకు గురైన వారే. ధిక్కారం సహించకపో దమనే రాచరిక అహంభావం పాలకుల్లో గూడుకట్టుకున్న చోట పదహారణాల ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదని చెప్పుకో డం మనల్ని మనం మోసం చేసుకోడమే.

# వైభవంగా దేవి శరన్నవరాత్రులను నిర్వహిస్తాం

## - మహంకాళి ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి

**సికింద్రాబాద్ 13అక్టోబర్ (తెలంగాణ షాన్):** ఈ నెల 15 నుండి 23 వరకు సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి వెల్లడించారు.ఆలయంలో ధర్మ కర్తలమండలి సభ్యులతో కలిసి శుక్రవారం నాడు మీడియాకు వివరాలను వెల్లడించారు.దసరా నవరాత్రులలో నిత్యం చండీ హెూమం,అమ్మవారిని ప్రత్యేక అలంకరణ ఉంటుందని చెప్పారు. 15న శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి,16న శ్రీ గాయత్రీ దేవి,17న శ్రీ రాజరాజేశ్వరి దేవి,18న శ్రీ అన్నపూర్ణాదేవి,19న శ్రీ గజలక్ష్మి దేవి, 20న శ్రీ సరస్వతి దేవి,21న శ్రీ మహిషాసుర మర్ధిని దేవి,22న శ్రీ దుర్గాదేవి,23న శ్రీ మహాకాళి దేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇవ్వరున్నారని మనోహర్ రెడ్డి వెల్లడించారు.ఆలయ ప్రాంగణంలో 20వ తేదీన బతుకమ్మ సంబరాలు జరుగుతాయని..ఈ సంబరాలలో అందరూ పాల్గొనాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు మైల కోసం ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు



చేశామన్నారు.ఈ సమావేశంలో ఈవో మనోహర్ రెడ్డి తో పాటు ధర్మకర్త మండలి సభ్యులు పి.రామ్ మోహన్ యాదవ్, మనిక్యారావు యాదవ్, జగదీష్ వర్మ,విశ్వనాథం. బచ్చు మహేష్, అరుణ్ బట్, దేవేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# నాచారం డివిజన్ మహిళా నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి







**కాప్రా సర్కిల్ అక్టోబర్ 13 శుక్రవారం తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు:** బీఆర్ఎస్ పార్టీ నాచారం కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ మహిళా నాయకుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై రాబోయే ఎన్నికల దృష్ట్యా ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొని పార్టీ బలోపేతానికి మహిళా నాయకత్వం ముఖ్యమని మహిళా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహిళల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబాక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, గృహలక్ష్మీ, డబల్ బెడ్ రూమ్, తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరల పంపిణీ తదితర పథకాల ద్వారా మహిళలకు కేసీఆర్ నాయకత్వంలో లబ్ధి చేకూరుతుందని, మహిళలు బాగుంటే ఆ కుటుంబం బాగుంటుందని మహిళలు చైతన్యవంతులై పథకాలను వివరిస్తూ ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. మహిళలందరు ఆశీర్వాదించాలని కోరారు. పార్టీ బలోపేతానికి కష్టపడే ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని ముఖ్యంగా మహిళలకు పార్టీ అండగా ఉంటూ, మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ కల్పించడం కేసిఆర్ నాయకత్వానికి మాత్రమే సాధ్యమని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి శాంతి ఆధ్వర్యంలో డివిజన్ మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెడ్డి కాలనీలో వెలసిన బ్యానర్

## - మా డ్రైనేజీ సమస్య పరిష్కరించిన వారికే మద్దతిస్తాం




**అక్టోబర్ 12 గురువారం తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు:** గత దశాబ్ద కాలంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నా కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ చక్రిపురం రెడ్డి కాలనీ వాసులు తమ సమస్యను పరిష్కరించిన వారికే మద్దతిస్తామని స్పష్టం చేశారు ఈ మేరకు కాలనీ ప్రధాన గేటు వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. తమ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి ఇప్పటికీ మూడు సార్లు శంకుస్థాపన చేశారు. కానీ ఎక్కడున్నా పని అక్కడే ఉందన్నారు. ఇప్పటికీ ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు కార్పోరేటర్లు మారారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ మా సమస్య ఇంత వరకు ఎవరూ పరిష్కరించలేదన్నారు. ఇప్పుడు ఎవరైతే మా సమస్య పరిష్కరిస్తారో వారికే మద్దతిస్తామని ప్రకటించారు రెడ్డి కాలనీవాసులు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు దయచేసి తప్పుగా భావించవద్దని, ఎందుకంటే మాకు మా సమస్యకు పరిష్కారం ముఖ్యమన్నారు. ఇదిలా ఉండగా ఇదే బాటలో సమస్యలు పరిష్కారం కానీ పలు కాలనీలో బ్యానర్లు వెలిచే అవకాశం ఉందని తెలిసింది.

# కృష్ణ బ్యూటీ సెంటర్ 10వ వార్షికోత్సవ కార్యక్రమంలో సర్టిఫికెట్లు, అవార్డులు ప్రధానం






హైదరాబాద్, గోషామహల్, అక్టోబర్ 13 :కృష్ణా బ్యూటీ సెంటర్ పదవ వార్షికోత్సవం సందర్భంగా సుధా జైన్ మాజీ మిసెస్ ఆసియా పసిఫిక్ ఇంటర్నేషనల్ బ్యూటీ అకాడమీలు, బ్యూటీషియన్‌లకు ఈరోజు జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు, అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి సుధా జైన్ మాట్లాడుతూ, సత్కరించి అవార్డు పొందిన వారిని కొనియాడుతూ, భారతీయ పరిస్థితులకు మేలు చేసే ఎన్ ప్లస్ షాంపూ, ఎన్ ప్లస్ కండీషనర్లు వంటి ప్రసిద్ధ బ్రాండ్‌లకు కృష్ణా బ్యూటీ సెంటర్ పేరుగాంచిందని, వెంట్రుకలు మృదువుగా, చుండ్రు లేనిది. బ్యూటీ సెంటర్‌లో మహిళలు మరియు యువకులందరికీ సంబంధించిన ఉత్పత్తులు ఉన్నాయి మరియు త్వరలో మొటిమలు మరియు మొటిమల కోసం ఉత్పత్తులను ప్రారంభించబోతున్నాయి. శ్రీ గౌతమ్‌కుమార్ రాజ్ పురోహిత్ వ్యవస్థాపకుడు మరియు కృష్ణ బ్యూటీ సెంటర్ యజమాని మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలోని చాలా ప్రసిద్ధ పార్లర్‌లకు తాము చిన్న నుండి పెద్ద అవసరాల వరకు అందం ఉత్పత్తులను అందిస్తున్నామని చెప్పారు. వారి నందిని బ్రాండ్ చర్మ సంరక్షణ ఉత్పత్తులు సెలబ్రిటీలు, మేకప్ ఆర్టిస్ట్ మరియు ఇతరులు వాటిని ఉపయోగిస్తున్నారు. వారి పెళ్లికి సంబంధించిన మేకప్ కిట్‌లు, షాంపూలు మరియు హెర్బల్ ఉత్పత్తులు సాధారణ బ్యూటీ ఉత్పత్తులతో పాటు నాణ్యత మరియు ధర పరంగా స్టోర్‌లో పూర్తి పారదర్శకత ఉన్నందున ప్రసిద్ధి చెందాయి. స్టోర్ ఎటువంటి నకిలీ ఉత్పత్తులతో వ్యవహరించదు. వారు లోరియల్, షానాజ్ హుస్సేన్ లాక్మే వంటి అనేక ప్రసిద్ధ బ్రాండ్‌లను కలిగి ఉన్నారు మరియు హెూల్‌సేల్ మరియు రిటైల్‌లో అనేక ప్రసిద్ధ బ్రాండ్‌లను కలిగి ఉన్నారు. పారి బ్యూటీ స్కూల్ మరియు డైరెక్టర్ సౌత్ ఇండియా బ్రైడల్ మేకప్ స్టూడియోకి చెందిన డాక్టర్ ప్రతిమ రాజ్ కూడా గౌరవ అతిథిగా విచ్చేశారు, కృష్ణా బ్యూటీ సెంటర్ నాణ్యమైన ఉత్పత్తులకు మరియు సరసమైన ధరలకు ప్రసిద్ధి చెందిందని అన్నారు.


# ఎన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ ఓటమి తథ్యం : మేడే రాజీవ్ సాగర్

హైదరాబాద్ : అవినీతికి, స్కాములకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్ నిలుస్తుందని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ దుయ్యబట్టారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా బెంగళూరులోని కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో పట్టుబడ్డ రూ. 42 కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు. కర్ణాటకలో గెలిచి ఆరు మాసాలు గడవక ముందే వసూళ్ల పర్వానికి తెరలేపారని విమర్శించారు. అక్కడ అక్రమంగా సంపాదించిన సొమ్ముతో తెలంగాణలో గెలువాలని చూస్తుందని మండిపడ్డారు. తెలంగాణలో అసలు కాంగ్రెస్ పార్టీకి స్థానం లేదని అందుకే వేల కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తుందన్నారు. అందులో భాగంగానే అక్కడి బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి అక్కడి నుంచి వేల కోట్లు వసూలు చేసిన డబ్బులను తెలంగాణకు తరలిస్తున్నారని విమర్శించారు. నేడు తెలంగాణ ఎన్నికల కోసం కర్ణాటక నుంచి అక్రమంగా డబ్బు తరలించి దొరికిన



కాంగ్రెస్ పార్టీ.. రేపు తెలంగాణలో అధికారంలోకి వస్తే ఇదే తరహాలో ఇతర రాష్ట్ర ఎన్నికల కోసం తెలంగాణ నుంచి అక్రమంగా డబ్బు తరలించడం ఖాయమన్నారు. కర్ణాటక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి. ఇతర రాష్ట్రాల ఎన్నికలపై దృష్టి సారించడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అసలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులే లేరని, అందుకే ఇంతవరకు ఒక్క అభ్యర్థిని సైతం ప్రకటించలేదని విమర్శించారు. ఆలు లేదు సోలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు అసలు అభ్యర్థులనే ప్రకటించని కాంగ్రెస్ పార్టీలో డజనుకు పైగా నేతలు సీఎం పదవి కోసం పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు.

# ట్విస్టులే ట్విస్టులు.. నాయకుల అలకలు.. పార్టీ పెద్దల బుజ్జగింపులు




హైదరాబాద్: ఎన్నికలొచ్చాయంటే ఇవన్నీ మామూలే. కానీ ఈసారెందుకో అన్ని పార్టీల్లో కాస్త ఎక్కువగానే ఉన్నాయి. కాంగ్రెస్‌లో ఈ అలకలు, బుజ్జగింపులు 70 ఎంఎంలో కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో కోపతాపాలు, అలకలు, వేరుకుంపట్లు వెరీ కామన్. ఈసారి తెలంగాణలో అధికారంలోకొస్తామన్న నమ్మకంతో ఉన్న హస్తం పార్టీలో టికెట్ల పోటీ పెరిగింది. ఆ పోటీ చివరికి అలకలస్థాయిని దాటిపోయి.. పార్టీని షేక్ చేస్తోంది. అవమానాలు ఇంకానా.. ఇకపై సాగవు.. ఇకపై చెల్లవు అంటూ పార్టీతో నాలుగున్నర దశాబ్దాల అనుబంధాన్ని తెంచేసుకున్నారు సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య.

టికెట్ వచ్చే ఛాన్స్ లేదనో, తన నియోజకవర్గం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల్లోకి వెళ్లిందనో పార్టీకి గుడ్‌బై చెప్పలేదు పొన్నాల. పోతూపోతూ బట్టకాల్చి కాంగ్రెస్ మొహాన వేశారు. కాంగ్రెస్ పార్టీలో కొన్నాళ్లుగా వినిపిస్తున్న బీసీ వాదాన్ని ప్రస్తావిస్తూనే టికెట్లు అమ్ముకుంటున్నారంటూ పెద్ద బాంబు పేల్చారు. కొన్నిరోజులుగా హస్తిన స్థాయిలో కాంగ్రెస్‌లో జరుగుతున్న బీసీ ఫైట్ ఈ పరిణామంతో కొత్త టర్న్ తీసుకుంది. తమ సీట్ల కోసం గాంధీభవన్ వద్ద దగ్గర ధర్నాకు సిద్ధమైన బీసీ నేతలు అధినాయకత్వం ఆగ్రహంతో వెనక్కి తగ్గారు. కానీ పొన్నాల రాజీనామాతో పార్టీలో బీసీ వర్గాలను బుజ్జగించడం, వారిని సంతృప్తి పరచడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలే కాబోతోంది.

ఇప్పటికే కాంగ్రెస్ టికెట్ల ప్రకటన ఆలస్యమైపోయింది. పొన్నాల ఎపిసోడ్‌తో ఫస్ట్ లిస్ట్ విషయంలో కాంగ్రెస్ ఒకటికి నాలుగుసార్లు ఆలోచించాల్సి వచ్చేలా ఉంది. కొత్త నేతలు చేరితే పాత నేతలు పార్టీ వీడుతున్నారు. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తే పాత నాయకత్వం అలుగుతోంది. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి కాంగ్రెస్ కండువా కప్పుకోగానే మేడ్చల్-మల్కాజ్‌గిరి, మెదక్ డీసీసీ అధ్యక్షులిద్దరూ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరిపోయారు. వారిలో నందికంటి శ్రీధర్‌కి నామినేటెడ్ పోస్టు కూడా రావటంతో.. కాంగ్రెస్ లిస్ట్ వచ్చాక ఇలాంటి సీన్లు ఇంకెన్ని చూడాల్సి వస్తుందో అంతుపట్టటం లేదు. ఆదిలాబాద్‌లో ఎన్నారై నేతపై పాత నేతలు రగిలిపోతున్నారు. నాగర్ కర్నూల్ లాంటి సీట్లో సీనియర్లు కుమ్ములాడుకుంటున్నారు. కమ్మవర్గానికి కనీసం 10సీట్లు ఇవ్వాలన్న డిమాండ్‌తో అధిష్ఠానం మెడపై కత్తిపెట్టారు కొందరు కాంగ్రెస్ నేతలు. ఎంత బుజ్జగించినా ఎంతవరకు సర్దుకుపోతారో చెప్పలేమన్నట్లే ఉంది కాంగ్రెస్ సీన్. విపక్షపార్టీలకంటే చాలా ముందుగానే వ్యూహాత్మకంగా టికెట్లు ప్రకటించిన బీఆర్ఎస్‌లో కూడా కొన్నిచోట్ల అసంతృప్తులు రాజుకున్నాయి. బుజ్జగింపులతో కొందరు నేతలు సర్దుకుపోతే..మరికొందరు పార్టీ వీడారు. ఇంకొందరు మంచి ఛాన్స్ వస్తే చూద్దామన్నట్లున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో సీట్లు దక్కని ముగ్గురు సిట్టింగ్‌ల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. బోథ్ ఎమ్మెల్యేని బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. టికెట్లు రాకపోవటంతో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలిద్దరూ మొదట అలిగినా.. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులిచ్చి సముదాయించింది బీఆర్ఎస్ నాయకత్వం. తుమ్మల, పొంగులేటి లాంటి సీనియర్లు పార్టీ వీడిన ఖమ్మం జిల్లాలో అసంతృప్తి పెరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది అధికారపార్టీ. వైరా టికెట్ మార్చటంతో అక్కడ అసంతృప్తి రాజుకున్నా.. పార్టీ పెద్దల జోక్యంతో పరిస్థితి చక్కబడింది. సిట్టింగ్‌లకే సీట్లు ఇవ్వటంతో అధికారపార్టీలో ఆశావహులు నిరాశపడ్డా.. మళ్లీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు ఉంటుందన్న భరోసా ఇస్తోంది బీఆర్ఎస్. దీంతో సీట్లు ఖాయమనుకున్న కొందరు ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు సర్దుకుపోతున్నారు. కల్వకుర్తి టికెట్ సిట్టింగ్‌కే ఇవ్వటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అక్కడి కాంగ్రెస్ అభ్యర్థి డైలమాలో పడ్డారు. ముందే టికెట్లు ప్రకటించేయటంతో బీఆర్ఎస్‌కి సామాజిక సమీకరణాలు కొంత ఇబ్బందికరంగా మారాయి. ఒక్క సీటూ ఇవ్వలేదన్న అసంతృప్తితో ఉంది ముదిరాజ్ వర్గం. పార్టీ పెద్దలు ఎంతగా నచ్చజెప్పినా ఎన్నికల బరిలో నిలుస్తానంటున్నారు కొందరు ముదిరాజ్ నేతలు. ఓపక్క పార్టీలోని అసంతృప్తులను ఎక్కడికక్కడ బుజ్జగిస్తూనే.. కొత్తగా పార్టీలో చేరేవారికి కూడా పదవుల హామీ ఇస్తోంది బీఆర్ఎస్. కొందరికి వెంటనే పదవులిస్తూ విపక్షపార్టీలను ఆత్మరక్షణలో పడేసే వ్యూహంతో ఉంది.

మిగిలిన పార్టీలతో పోలిస్తే బీజేపీలో అంతగా అసంతృప్తులు బయటపడకపోయినా లోలోపల వర్గపోరు నడుస్తోంది. ప్రధాని పర్యటనకు కూడా కొందరు ముఖ్యనేతలు దూరంగా ఉండటంతో బీజేపీ నాయకత్వం అప్రమత్తమైంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రకటించిన 14కమిటీల్లో అందరికీ ప్రాధాన్యం దక్కేలా జాగ్రత్తపడింది. కొంత కాలంగా పార్టీ అధిష్ఠానంపై గుర్రుగా ఉన్న నేతలకు ఈ కమిటీల్లో కీలక పదవులు దక్కాయి. విజయశాంతి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలాంటి నేతలందరికీ పార్టీ పెద్దపీట వేసింది. ఎన్నికలముందు లేదులేదంటూనే రాష్ట్ర నాయకత్వాన్ని మార్చిన పార్టీ.. ముఖ్య నేతలమధ్య గ్యాప్‌ని పూడ్చే ప్రయత్నాల్లో ఉంది. నాలుగ్గోడలమధ్యే మాట్లాడి సర్దుబాటు చేస్తోంది. రామగుండం లాంటి చోట సోమారపు సత్యనారాయణలాంటి సీనియర్ పార్టీ వీడినా.. ప్రస్తుతానికైనా ఆ పార్టీలో అలకలు, అసంతృప్తులు అంతగా బయటపడలేదు. అసలే ఎన్నికల సీజన్. గీత దాటారంటే వేటు పడుద్దని హెచ్చరించే పరిస్థితి దాదాపుగా ఏ పార్టీలో కూడా లేదు. బతిమాలో బుజ్జగించో ఎవరూ చేజారకుండా చూసుకుంటున్నాయ్ అన్ని పార్టీలు.

# గజ్వేల్ నియోజకవర్గంపై కొనసాగుతోన్న ఉత్కంఠ

గజ్వేల్: ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంది.. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది.. మిగత పార్టీలు అభ్యర్థులను ప్రకటించక పోయిన పలనా నియోజక వర్గంలో పలన అభ్యర్థి పోటీలో ఉంటాడు అనే ప్రచారం జరుగుతోంది. కానీ ఆ ఒక్క నియోజకవర్గంలో మాత్రం కమలం పార్టీ నుండి ఎవరు పోటీలో ఉంటారు అనే విషయంలో మాత్రం ఇంకా అయోమయంగానే ఉంది. ఆ నియోజకవర్గం మరెదో కాదు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్. ఈ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ నుంచి ఎవరు పోటీ చేయనున్నారు అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠనెలకొంది. అటు హుజురాబాద్, ఇటు గజ్వేల్ నుంచి తాను పోటీలో ఉంటానని గురువారం ఈటెల రాజేందర్ తెలిపారు. కానీ ఈ విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ పార్టీ తరుపున పోటీ చేయడానికి అభ్యర్థులు లేకపోవడంతో, బయట నుంచి ఇతర వ్యక్తులను ఇక్కడ పోటీలో దింపారు. అయితే సీఎం కేసీఆర్ ఇలాఖాలో కమలం పార్టీకి సరైన నేతలు లేరని గ్రహించిన అధిష్టానం.. ఇక్కడ నందన్ గౌడ్ అనే వ్యక్తిని నియమించి పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని అతనికి చెప్పారు. దీంతో గత రెండు సంవత్సరాల నుంచి గజ్వేల్ నియోజకవర్గం బీజేపీ కొంత యాక్టివ్ అయ్యిందని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరిగింది. కమలం పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నందన్ గౌడ్ ఆధ్వర్యంలో అవి సక్సెస్ అవుతున్నాయట..అయితే ఇప్పుడు నందన్ గౌడ్ గజ్వేల్ బీజేపీ టికెట్ ఆశిస్తున్నాడట ఈ నియోజకవర్గంలో ఇతర నేతలు కూడా పెద్దగా లేకపోవడంతో ఇక టికెట్ ఆయనకే అనే నమ్మకంతో పనిచేశాడట. ఆయన అనుచరులు కూడా టికెట్ తమ నేతకే వస్తుంది అని నియోజకవర్గ వ్యాప్తంగా బాగా ప్రచారం చేశారని సమాచారం. అయితే తాజాగా ఇప్పుడు ఈటెల రాజేందర్ పేరు తెర పైకి రావడంతో నందన్ గౌడ్ వర్గంలో అలజడి మొదలు అయ్యిందట. ఇన్ని రోజులు పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, దానికి తగిన ప్రతిఫలం అందదేమో అని ఆందోళనకు గురవుతున్నారంటా నందన్ గౌడ్ వర్గం.

# డార్విన్, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలను సవాల్ చేస్తూ పిల్.. తిరస్కరించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: డార్విన్, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అయితే ఈ సిద్ధాంతాలు తప్పుగా ఉన్నాయని పిటిషనర్ భావిస్తే కోర్టు ఏం చేయగలదు? అని ధర్మాసనం ప్రశ్నించింది. మీరే సొంతంగా సిద్ధాంతాలు రూపొందించుకోవాలని సూచించింది. ఆ పిల్ ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు రాదని పేర్కొంటూ తిరస్కరించింది.

ఐన్‌స్టీన్ సాపేక్షత సమీకరణ సిద్ధాంతం $E = mc^2$, మనిషి జీవన పరిణామానికి సంబంధించిన డార్విన్ సిద్ధాంతాన్ని సవాల్ చేస్తూ రాజ్‌కుమార్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను స్కూల్, కాలేజీలో చదివిన ఈ సిద్ధాంతాలు తప్పని పిల్‌లో పేర్కొన్నాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం తన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిందని ఆరోపించాడు. డార్విన్ సిద్ధాంతాన్ని నమ్మి లక్షలాది మంది చనిపోయారని కోర్టుకు తెలిపాడు. ఈ నేపథ్యంలో ఈ రెండు సిద్ధాంతాలు తప్పని నిరూపించేందుకు అనుమతించాలని సుప్రీంకోర్టును కోరాడు. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిల్‌పై విచారణ జరిపింది. ఈ సిద్ధాంతాలు తప్పని భావిస్తే వాటిని మెరుగుపర్చాలని పిటిషనర్‌కు సూచించింది. ఇందులో కోర్టు ఏం చేస్తుందని ప్రశ్నించింది. 'సైన్స్ స్టూడెంట్‌ను, స్కూల్లో ఏదో చదివానని అంటున్నావు. ఇప్పుడు ఆ సిద్ధాంతాలు తప్పని అని అంటున్నావు. చాలా ఏళ్ల నాటి ఆ సిద్ధాంతాలు తప్పని అని నువ్వు నమ్మితే దానికి సర్వోన్నత న్యాయస్థానం ఏమి చేస్తుంది? ఆర్టికల్ 32 ప్రకారం మీ ప్రాథమిక హక్కుకు ఏం ఉల్లంఘన జరిగింది?' అని ప్రశ్నించింది. 'నువ్వు నీ సొంత థియరీని ప్రతిపాదించుకుని ప్రచారం చేసుకో' అని సూచిస్తూ ఆ పిల్‌ను కొట్టివేసింది.

# గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం విచారణ సోమవారానికి వాయిదా



న్యూఢిల్లీ: గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు మళ్లీ సోమవారం విచారణ చేపట్టనున్నది. 26 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఓ మహిళ సుప్రీంలో పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. ఆ మహిళకు చెందిన అన్ని రిపోర్టులు ఇవ్వాలని ఎయిమ్స్ వైద్యులను సుప్రీం ఇవాళ ఆదేశించింది. ఆ మహిళ పిండానికి ఎటువంటి సమస్యలు ఉన్నాయో గుర్తించాలని ఎయిమ్స్‌ను సుప్రీం కోరింది. మానసిక చికిత్స కోసం తీసుకుంటున్న డ్రగ్స్ వల్ల గర్భంలో ఉన్న పిండానికి ఎటువంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయో స్టడీ చేయాలని ఎయిమ్స్‌ను సుప్రీం కోరింది. ఆ మహిళ మానసిక, శారీరక రుగ్మతల గురించి విశ్లేషణ చేపట్టాలని ఎయిమ్స్ వైద్యుల్ని సుప్రీం కోరింది. పిండాన్ని రక్షించుకునేందుకు ఏదైనా ప్రత్యామ్నాయ వైద్యం ఉందో లేదో తెలుసుకోవాలని ఎయిమ్స్‌ను సుప్రీం అడిగింది. 26 వారాల ప్రెగ్నెంట్ పెట్టుకున్న అభ్యర్థన కేసులో గురువారం సీజే చంద్రచూడ్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆర్డర్ ద్వారా పర్మిషన్ తీసుకుని శిశువును చంపాలనుకుంటున్నారా అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రశ్నించారు. ఈ కేసులో శుక్రవారం మళ్లీ విచారణ చేపట్టారు. అబార్షన్ అపీల్ గురించి ఆ మహిళతో కేంద్రం తరపున లాయర్ మాట్లాడాలని సుప్రీంకోర్టు సూచించింది. సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. ఇద్దరు పిల్లల తల్లి అయిన ఆమె ఇప్పటికే డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. మానసికంగా, ఆర్థికంగా మూడవ శిశువును పెంచే స్థితిలో తాను లేనట్లు ఆమె ఆ పిటీషన్‌లో తెలిపింది. ఈ కేసులో అబార్షన్‌కు అనుమతి ఇస్తూ అక్టోబర్ 9వ తేదీన కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఎయిమ్స్ వైద్యుల బృందం మాత్రం అబార్షన్‌కు నిరాకరించారు. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బీవీ నాగరత్నతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం బుధవారం ఈ కేసులో భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసింది. దీంతో ఆ కేసును ఇవాళ సీజే చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం టేకప్ చేసింది.

# సీల్దా-రాజధాని ఎక్స్‌ప్రెస్ రైల్లో కాల్పులు.. వ్యక్తి అరెస్ట్



న్యూఢిల్లీ: జార్ఖండ్ మీదుగా ఢిల్లీకి వెళ్తున్న సీల్దా-రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి కాల్పులకు పాల్పడ్డాడు. జార్ఖండ్‌లోని ధన్‌బాద్ రైల్వే స్టేషన్‌లో రైలెక్కిన హర్వీందర్ సింగ్ (41) అనే వ్యక్తి.. కాసేపటికే ఆ రైల్లోని కోచ్ అటెండెంట్‌తో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో తన దగ్గరున్న పిస్తోల్ తీసి కాల్పులు జరిపాడు. దాంతో అప్రమత్తమైన రైల్వే పోలీసులు నిందితుడిని పట్టుకుని కొడెర్మా రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సిబ్బందికి అప్పగించారు. అనంతరం స్థానిక పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. నిందితుడికి సంబంధిత సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. కాగా నిందితుడి కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

# మొదటి విమానంలో ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీకి 212 మంది భారతీయులు



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం కారణంగా ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న భారతీయులను భారత్ స్వదేశానికి తరలిస్తోంది. ఈ తరలింపు ఆపరేషన్‌కు కేంద్రం 'ఆపరేషన్ అజయ్' అని పేరు పెట్టింది. ఈ ఆపరేషన్ అజయ్‌లో భాగంగా 212 మంది భారతీయులతో తొలి విమానం శుక్రవారం ఢిల్లీకి చేరుకుంది. తొలి విమానంలో ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న ప్రయాణికుల ఫొటోలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఆరిందమ్ బాగ్చీ ట్విటర్ లో షేర్ చేశారు. తన పోస్టుకు 'వెల్‌కమ్ టు ది హోమ్‌లాండ్' అని భారతీయులను స్వాగతిస్తూ వెల్‌కమ్ నోట్ జతచేశారు. కాగా, ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు కేంద్రం బుధవారం ఆపరేషన్ అజయ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలి విమానంలో ఇవాళ 212 మంది భారతీయులు ఢిల్లీకి చేరుకున్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపకపోతే ఇతర సరిహద్దుల్లో యుద్ధం: ఇరాన్



టెహ్రాన్: గాజాపై ఇజ్రాయెల్ బాంబు దాడులు ఆపకపోతే ఇతర సరిహద్దుల్లో యుద్ధం మొదలు కావచ్చని ఇరాన్ హెచ్చరించింది. లెబనాన్‌కు చెందిన హిబ్జుల్లా ఇజ్రాయెల్‌పై దాడులకు సిద్ధంగా ఉందన్న సంకేతం ఇచ్చింది. ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమిరాబ్‌డొల్లాహియాన్ గురువారం సాయంత్రం బీరూట్‌కు చేరుకున్నారు. అక్కడ హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ ప్రతినిధులు, లెబనీస్ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గాజాపై ఇజ్రాయెల్ దూకుడు, యుద్ధ నేరాలకు పాల్పడటం, ముట్టడి నేపథ్యంలో ఇతర సరిహద్దుల వద్ద వాస్తవ యుద్ధానికి దారి తీయవచ్చని అన్నారు. కాగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమిరాబ్‌డొల్లాహియాన్ గురువారం తెల్లవారుజామున ఇరాక్‌ను సందర్శించారు. ఆ దేశ ప్రధాని మొహమ్మద్ షియా అల్-సుడానీతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన అక్కడ కూడా ఇలాంటి ప్రకటన చేశారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపకపోతే ఆ దేశ ఇతర సరిహద్దుల్లో యుద్ధం ఆరంభమవుతుందని హెచ్చరించారు.

తెలంగాణ షాన్
TELANGANA SHAAN
శనివారం, అక్టోబర్ 14, 2023
Saturday, October 14, 2023

## హాస్పిటల్? బెడ్‌పై సమంత.. కారణం ఇదే



ఒకప్పుడు టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా కొనసాగిన సమంత కెరీర్ ఈ మధ్య ఏమంత ఆశాజనకంగా లేదని చెప్పవచ్చు. లేడీ ఓరియెంటెడ్ మూవీ 'శాకుంతలం' దారుణమైన ఫలితాన్నందుకోగా..

ఇటీవలే వచ్చిన రొమాంటిక్ మూవీ 'ఖుషి' రిజల్ట్ ఆమెను మరింత నిరాశ పరిచింది. ఈ రెండు చిత్రాలకూ సమంత మైనస్ అయ్యిందనే చర్చ కూడా జరిగింది. ఈ చిత్రాల్లో ఆమె లుక్‌తో పాటు నటనకు పేరు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. సమంత అనారోగ్యం కూడా ఆమె లుక్స్, కెరీర్ మీద ప్రతికూల ప్రభావం చూపించినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం దుబాయ్ వెకేషన్‌ను ఎంజాయ్ చేస్తోన్న ఆమె పలు ఫోటోలను తన ఫ్యాన్స్‌కఎప్పటికప్పుడు షేర్ చేస్తూ టచ్‌లో ఉంటుంది.రోగ నిరోధక శక్తి కోసం తాజాగా సమంత హాస్పిటల్ బెడ్డు మీద ఉన్నట్టుగా, చేతికి సెలైన్ పెట్టించుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. ఆ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. . మందుల వల్ల తనకు కలిగే ప్రయోజనాల గురించి ఓ పోస్ట్ చేశారు. తనకు ఈ డ్రిప్పే ఇమ్యూనిటీ అందిస్తాయని ఇలా తెలిపింది. 'ఇమ్యూనిటీ బూస్ట్ వల్ల కలిగే లాభాలివే.. రక్త కణాల ఉత్పత్తి, రోగ నిరోధక శక్తి పెరుగుదల, హృదయ సంరక్షణ, కండరాల శక్తి, వైరస్‌లకు వ్యతిరేకంగా పోరాడే శక్తి, హృదయానికి రక్త సరఫరా, ఎముకల బలహీనత పోగొట్టేందుకు ఈ డ్రిప్పే ఉపయోగపడుతాయి.' అంటూ సమంత చెప్పుకొచ్చింది.దీంతో ఫ్యాన్స్ ఎలాంటి కంగారుపడాల్సిన అవసరం లేదని చెప్పవచ్చు. సమంతకు ఏమీ కాలేదని, తాను రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు ఇలా సెలైన్ ఎక్కించుకుంటున్నట్లు ఆమె చెప్పకనే చెప్పింది. ఇక సమంత కొత్తగా ఎలాంటి సినిమాలను ఒప్పుకోలేదు. గతంలో ఓకే చేసిన సిటాడెల్ అనే వెబ్ సిరీస్‌లో మాత్రమే ఆమె నటిస్తుంది. ఈ ప్రాజెక్ట్ కూడా దాదాపు పూర్తి అయినట్లు సమాచారం. ఈ వెబ్ సిరీస్ త్వరలో అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం కానుంది. కానీ సమంత త్వరలో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుస్తోంది.


## దసరా సినిమాలు.. బాక్సాఫీస్ వద్ద స్టార్ హీరోల పోటీ..

కోలీవుడ్ స్టార్స్ చిత్రాలు కూడా దసరా బరిలో నిలిచాయి. అవేంటో తెలుసుకుందామా.

తెలుగు సినీ పరిశ్రమలో ఫెస్టివల్ సీజన్ వచ్చిందంటే బాక్సాఫీస్ వద్ద ల జోరు ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. చిన్న ల నుంచి పెద్ద చిత్రాల వరకు ఈ సీజన్?లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుంటాయి. ముఖ్యంగా టాలీవుడ్ ఇండస్ట్రీలో అగ్రహీరోలు మాత్రం ఫెస్టివల్ సీజన్ పైనే గురిపెడుతుంటారు. ఇక ఇప్పుడు దసరా పండగ రాబోతుంది. ఈ ఏడాది దసరా బరిలో ఏకంగా ఐదు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడేందుకు రెడీ అయ్యారు. అందులో నాలుగు పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతుండగా.. ఒక్క మాత్రమే తెలుగులోనే రిలీజ్ కానుంది. అదే బాలయ్య నటించిన భగవంత్ కేసరి. ఈ మూవీ మాత్రమే కేవలం తెలుగులోనే రిలీజ్ కాబోతుంది. ఇక ఈసారి నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం భగవంత్ కేసరి. ఇదివరకు అడియన్స్ ఎప్పుడూ చూడని బాలయ్యను ఈ మూవీలో చూడనున్నారని ముందు నుంచి చెప్పుకొస్తున్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. అందుకు తగినట్లుగానే ఇప్పటివరకు విడుదలైన బాలయ్య పోస్టర్స్ ఆకట్టుకున్నాయి. అలాగే సాంగ్స్, ట్రైలర్ మూవీపై మరింత బజ్ క్రియేట్ చేశాయి. కాజల్, శ్రీలీల కీలకపాత్రలలో నటిస్తోన్న ఈ అక్టోబర్ 19న విడుదల కాబోతుంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్లలో బిజీగా ఉంది చిత్రయూనిట్.అలాగే కోలీవుడ్ హీరో విజయ్ దళపతి హీరోగా నటించిన లేటేస్ట్ చిత్రం లియో. డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తోన్న ఈ మూవీపై ఇప్పటికే ఓ రేంజ్ లో అంచనాలు పెరిగిపోయాయి. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తోంది. ఈ అక్టోబర్ 19న విడుదల కానుంది. అలాగే కన్నడలో సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ నటించిన ఘోస్ట్ సైతం అక్టోబర్ 19న రిలీజ్ కానుంది.

అలాగే మాస్ మాహారాజా రావితేజ నటిస్తోన్న మొదటి పాన్ ఇండియా చిత్రం టైగర్ నాగేశ్వరరావు. ఈ మూవీ అక్టోబర్ 19న రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. మరోవైపు బాలీవుడ్ స్టార్ టైగర్ ష్రాఫ్ నటించిన చిత్రం గణపత్. ఈ తో మరో ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించేందుకు రెడీ అయ్యాడు







## 16న వస్తున్న సైంధవ్ టీజర్





టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి సైంధవ్ వెంకటేశ్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రాన్ని హిట్ ఫేం శైలేష్ కొలను డైరెక్ట్ చేస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వెంకటేశ్ 75వ సినిమాగా వస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. చందప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే మిషన్ నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో జెర్సీ ఫేం శ్రద్ధా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ను అక్టోబర్ 16న లాంఛ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. మిషన్‌లో బిజీగా ఉన్న వెంకీ టీజర్ అప్‌డేట్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంతో నవాజుద్దీన్ సిద్దిఖీ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. మేకర్స్ సైంధవ్ పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో శ్రద్ధా శ్రీనాథ్ మనోజ్ఞగా కనిపించనుంది. రుహానీ శర్మ డాక్టర్‌గా, నవాజుద్దీన్ సిద్దిఖీ వికాస్ మాలిక్ పాత్రలో, కోలీవుడ్ యాక్టర్ ఆర్య మానస్ పాత్రలో నటిస్తున్నాడు. చాలా రోజుల క్రితం లాంఛ్ చేసిన సైంధవ్ గ్లింప్స్ వీడియో సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. సైంధవ్.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో 2024 సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



## కష్టాలను తట్టుకుని ముందుకు సాగామాస్ మహారాజా రవితేజ

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ తొలిసారి పాన్ ఇండియా సినిమా టైగర్ నాగేశ్వర రావుతో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది రవితేజ టీం. ప్రమోషన్స్ టైంలో ఏదో ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌తో అభిమానుల్లో జోష్ నింపుతున్నాడు. తాను ఈ స్థాయికి రావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నానని, ఇప్పుడు కెరీర్ తొలినాళ్లలో తాను పడ్డ ప్రతీ కష్టాన్ని, ఇబ్బందులను ప్రేమిస్తున్నానని చెప్పుకొచ్చాడు రవితేజ. కెరీర్‌లో నిలదొక్కుకునే సమయంలో ప్రతి ఒక్క రోజును గుర్తుంచుకుంటా. ప్రతీ కష్టాన్ని ఎంజాయ్ చేస్తా. నేనెప్పుడూ నిరాశ పడలేదు. ఏదో ఒక రోజు నిలదొక్కుకుంటానని నాకు తెలుసు.. అని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ ప్రతీ ఒక్కరిలో స్ఫూర్తి నింపుతున్నాయి. ఇటీవలే హిందీ ప్రమోషన్స్ లో భాగంగా జరిపిన చిట్‌చాట్‌లో అనుపమ్ ఖేర్, రవితేజ మధ్య జరిగిన ఓ సంఘటన తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. 1988లో రవితేజ నాతో ఫొటో దిగుతానని అడిగాడు. కానీ నేను తిరస్కరించానన్నాడు అనుపమ్ ఖేర్. అయితే అప్పట్లో తన దురుసు ప్రవర్తనను గుర్తు చేసుకొని.. రవితేజకు క్షమాపణలు చెప్పారు అనుపమ్ ఖేర్. ఈ వీడియో కూడా నెట్టింట వైరల్ అవుతోంది. 1970స్ కాలంలో స్టూవర్ట్‌పురంలో పాపులర్ దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వర్ రావు జీవిత కథగా పాన్ ఇండియా స్టోరీతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వంశీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాతో బాలీవుడ్ బ్యూటీ కృతిసనన్ సోదరి నుపుర్ సనన్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది.



## లాల్‌సలామ్‌తో వస్తోన్న రజనీ

ఏడు పదుల వయస్సులోనూ తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ.. తగ్గేదేలే అంటున్నాడు. ఈ ఏడాది జైలర్‌తో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న తలైవా ప్రస్తుతం కూతురు ఐశ్వర్య డైరెక్షన్‌లో లాల్ సలామ్ చేస్తున్నాడు. లాల్‌సలామ్‌లో మోయినుద్దీన్ భాయ్ పాత్రలో కనిపించబోతున్నాడు రజినీకాంత్. సూపర్ స్టార్ తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేశాడని లైకా ప్రొడక్షన్స్ ఓ వీడియో కూడా షేర్ చేసింది. ఆగస్టులో లాల్‌సలామ్ షూటింగ్ పూర్తి చేసుకున్నట్టు ఇప్పటికే అప్‌డేట్ అందించింది టీం. ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్

ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. లాల్‌సలామ్ తమిళనాడు థియాట్రికల్ రైట్స్‌ను రెడ్ జియాంట్ మూవీస్ సొంతం చేసుకుంది. మరోసారి మా హోం బ్యానర్ రెడ్ జియాంట్ మూవీస్‌తో నా ప్రేమ

కొనసాగుతుంది. సూపర్ ఇన్నింగ్స్ కోసం రెడీగా ఉండండి.. అని ట్వీట్ చేశాడు విష్ణు విశాల్. ఇప్పటికే విడుదల చేసిన లాల్ సలామ్ టైటిల్ పోస్టర్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ నిర్మిస్తుండగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. '3' మూవీతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చిన ఐశ్వర్య.. 'వాయ్ రాజా వాయ్', 'సినిమా వీరన్' సినిమాలు తెరకెక్కించింది. సిల్వర్ స్క్రీన్‌పై తండ్రీకూతుళ్ల కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

Edited, Printed, Published and Owned by **Ramancharla Srikanth** & Printed at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **Title Code: TELTEL 02105**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: rcsrikanth143@gmail.com